నేటి నుంచి విజయవాడకు బస్సు సర్వీస్

జీడిమెట్ల: జీడిమెట్ల బస్ డిపో నుంచి విజయవాడకు సోమవారం నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డీఎం ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30, రాత్రి 8.45, 9.30కు జీడిమెట్ల డిపో నుంచి ప్రతి రోజు బస్సులు విజయవాడకు, తిరిగి విజయవాడ నుంచి జీడిమెట్లకు ప్రతిరోజు ఉదయం 8.20, 9.30, రాత్రి 10.30కు బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీస్‌లో టికెట్ 10 శాతం రాయితీ ఇవ్వబడుతుందని, బస్సులో టీవీ సౌకర్యం కూడా ఉంటుందన్నారు.

కిచెన్ అండ్ బార్‌ను ప్రారంభించిన సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ



జ్యోతి వెలిగిస్తున్న సినీహీరో

కుత్బుల్లాపూర్: కొంపల్లి బృందావన్ కాలనీలో అంతేరా కిచెన్ అండ్ బార్‌ను ఆదివారం ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ ప్రారంభించారు. అంతేరా కిచెన్– బార్ భాగస్వాములలో ఒకరైన ఆశిష్ రెడ్డి మాట్లాడుతూ.. కొంపల్లికి తెలుగు వంటకాల రుచులను తీసుకురావడానికి ఇక్కడ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



నిజాంపేట్ : మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1 మజీద్‌లో ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాషా, అజాజ్ అహ్మద్, మెహబూబ్, కరీమ్, షాజహాన్, స్థానిక నాయకులు రాంచందర్, రాజు, నాగరాజు, రామకృష్ణారెడ్డి, వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

25న ఆలయ పంచమ వార్షికోత్సవం



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టపై ఉన్న కాళీకాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ధ్వజారోహణం, సామూహిక కుంకుమార్చన, గణపతి పూజ, అగ్ని పూజ, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, అమ్మవారి పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాల్మీకి బోయల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రస్తావించడం పట్ల బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్‌పీఎస్) నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో వెనకబాటుతో అనాగరికంగా సమాజానికి దూరం జీవిస్తున్న వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని బీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మీనుగు గోపి, యూత్‌వింగ్ అధ్యక్షులు బోయ రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నిషేధ ఉత్తర్వులు ఉపసంహరించుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనల పై నిషేధం విధిస్తూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఏఐడీఎస్‌వో నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నితీష్, కార్యదర్శి నాగరాజుతో పాటు వినోద్, స్రవంతి, శశాంక్, ప్రణీత్ కార్తీక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకట హర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం వినాయక ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సర్వేల పేరుతో ప్రభుత్వ స్థలానికి ఎసరు!

- గతంలో 29 గుంటలున్న స్థలం నేడు 25 గుంటలుగా చూపుతున్న మ్యాప్
- గతంలో అక్రమదారులపై కేసులు పెట్టిన ఉప కమిషనర్లు



ఇటీవల చేపడుతున్న నిర్మాణాలు, వేసిన పిల్లర్లు

చింతల్: సర్వేల పేరుతో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులకు అంటగడుతున్నారని గాజులరామారం సర్కిల్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ సర్వే నంబర్ 155 లో 29 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ పక్కనే మరో రెండు ఎకరాల 39 గంటల స్థలాన్ని ధోబీఘాట్ వాసులకు కేటాయించారు. 2007 లో సర్వే చేయగా 3550 గజాలు ఉన్నట్లు తేలింది. అదే విధంగా 2019 లో మరల సర్వే చేయగా 3553 గజాల స్థలం ఉందని, 2024 ఫిబ్రవరిలో జిల్లా అధికారులు సర్వే చేయగా 3553 గజాల స్థలం ఉందని డిజిటల్ సర్వే నిర్వహించి గాజులరామారం సర్కిల్ అధికారులకు పంపారు. కానీ ఈ డిజిటల్ సర్వేని చట్టబద్ధం చేయకుండా మరో కొత్త లేఅవుట్‌ను రూపొందించి కబ్జాదారులకు సుమారు 11 గుంటల స్థలాన్ని అప్పజెబుతూ బేస్మెంట్ నిర్మాణం చేశారు. కానీ ఈ లే అవుట్‌లో 29 గంటలకు బదులుగా 25 గుంటలే ఉందని రూపొందించి పేపర్లో చట్టబద్ధమైన పేపర్లో ఒకరకంగా, మిగిలి ఉన్న స్థలం మరో రకంగా ముగ్గు పోసి బేస్మెంటు నిర్మించిన ఘనత అధికారులకే చెల్లింది.

ఏడాది గడవక ముందే లే అవుట్ మార్పు!

2024 జూన్ నెలలో గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులు 3553 గజాల ప్రభుత్వ స్థలం ఉన్నట్టు ఆర్టీఐ ద్వారా జవాబు ఇచ్చారు. మరల 2025 మార్చిలో అక్కడ 25 ప్రభుత్వ స్థలం ఉన్నట్లు మరో లేఅవుట్ ఇచ్చారు. 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. 2025 ప్రారంభం నుంచి ఈ మూడు నెలల కాలంలో సుమారు 10 గుంటల స్థలం మేర ఇటీవలే అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. అనంతరం 2025 మార్చిలో మరోసారి ఆర్టీఐ ద్వారా జిల్లా సర్వే రిపోర్ట్‌ను తీయగా.. వారు మాత్రం 25 గుంటల ప్రభుత్వ స్థలం ఉందని నివేదిక ఇచ్చారు. కానీ అక్కడ మాత్రం 29 గుంటలకు మరో 11 గుంటల మేర స్థలాన్ని తగ్గించి బేస్మెంట్ నిర్మించడం జరిగింది. ఈ పది నెలల సమయంలో రెండు లేఅవుట్లు ఎలా రూపొందుతాయనేది డిప్యూటీ కమిషనర్‌కే తెలియాలని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వెళ్లిన డిప్యూటీ కమిషనర్లు 29 గుంటల మేరకు మాత్రమే అనేక పర్యాయాలు బేస్మెంటు, ఫెన్సింగ్ నిర్మాణం కోసం లక్షలాది రూపాయల మేర నిధులు వెచ్చించి 90 శాతం మేర ఫెన్సింగ్ వేశారు. కానీ ఇప్పటి డిప్యూటీ కమిషనర్ 90 శాతం పూర్తి అయిన ఫెన్సింగ్ ను వదిలేసి కొత్తగా జిల్లా అధికారులకు సర్వే చేయండి అని చెప్పడం వెనుక వారి ఆంతర్యం ఏమిటన్నది పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

సర్వే నంబర్ 150 లోని ప్రభుత్వ స్థలంలో ఉన్న 29 గుంటల్లో 11 గుంటల మేర పక్కనే ఉన్న ధోబీ ఘాట్ వాసులకు చెందినదంటూ డిప్యూటీ కమిషనర్ బేస్మెంట్ నిర్మించడంతో ధోబీఘాట్ వాసుల నిర్మాణాలు జోరందుకున్నాయి. 2024 ఆగస్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వ స్థలాన్ని సందర్శించగా.. కోర్టు పరిధిలో ఉందని తేలడంతో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. అయినా ధోబీ ఘాట్ వాసులు నిర్మాణాలు కొనసాగిస్తుండటం వెనుక భగత్ సింగ్ నగర్‌కు చెందిన స్థానిక నేతలు అండగా ఉన్నట్లు తెలుస్తోంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వివేకానంద్



సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన మైలరాం భార్గవికి రూ.1.25 లక్షలు, గాజులరామారం ప్రాంతానికి చెందిన షాజిత్ బేగంకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం రిలీఫ్ ఫండ్ అని అన్నారు. కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. జంట సర్కిళ్లకు చెందిన కొట్టె రామాంజనేయులుకు రూ.40 వేలు, నునవత్ శంకర్‌కు రూ.40 వేల చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, అరుణ్, ఆంజనేయులు, శంకర్ తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



కమిటీ సభ్యులను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులను ఆదివారం సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ కార్యక్రమానికైనా తన వంతు సహకారం ఉంటుందన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ చౌరస్తాలో లలిత హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్‌ను ఎస్‌పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి ప్రారంభించారు. 252 మందికి అవసరమైన మెడిసిన్ అందజేశారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో లలిత హాస్పిటల్ వైద్యులు సాయి స్వరూప్, రోహిత్, వెంకట సాయి, దినేష్ సింగ్, మనోజ్, రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రషీద్ బేగ్, దండే రాజు, అబేద్, పవన్, మరలింగ, జలీల్, శ్రీనివాస్ గౌడ్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



షిరిడీ హిల్స్‌లో..

లైఫ్ కేర్ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో..

డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ వద్ద లైఫ్ కేర్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అధ్యక్షులు బండ మహేందర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 55 మంది పాల్గొన్నారు. బీపీ, షుగర్ ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.

దుండిగల్ రైతులకు అండగా ఉంటా

- అక్రమంగా తీసుకోవాలని యత్నిస్తే ఊరుకోం
- ఎంపీ ఈటల రాజేందర్



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: రైతుల భూములను అక్రమంగా గుంజుకునేందుకు యత్నిస్తే ఊరుకునేది లేదని, హైకోర్టు ద్వారా వారికి న్యాయం జరిగేలా చూస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ గ్రామ సర్వే నంబర్లు 453, 454 లలో భూములున్న 64 మంది రైతులకు ప్రభుత్వం నోటీసులు అందిన నేపథ్యంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సదరు రైతులతో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆర్టీఏ కు ఇచ్చిన భూములను సర్వే చేయిస్తానని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఆకుల విజయ్‌సాయి, సోషల్ మీడియా కో కన్వీనర్ భాను ప్రసాద్, ఆకుల యశ్వంత్, తల్లారి రాజ్ కుమార్, పండుగ శ్రీశైలం, రైతులు పిట్ల సత్యనారాయణ, లక్ష్మణ్, చిన్నంగి మల్లేశం, మహేష్ కుమార్, విష్ణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలపై నిషేధం అర్థరహితం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనల పై నిషేధం విధించడం అర్థరహితమని తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పరుశురామ్ ఆదివారం పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు నిలయమైన ఓయూ ఖ్యాతి నేటి వరకు చెక్కు చెదరలేదన్నారు. కేవలం విద్యార్థుల ఆందోళనల పై నిషేధం విధిస్తే సమస్యలు పరిష్కారం కావన్నారు. సోమవారం ఏబీవీపీ నిర్వహించతలపెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

గ్రూప్-1 ఫలితాలపై సందేహాలను నివృత్తి చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-1 ఫలితాల పై అభ్యర్థుల సందేహాలను ప్రభుత్వంతో పాటు టీజీపీఎస్సీ అధికారులు నివృత్తి చేయాలని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ గ్రూప్-2, 3 మాదిరిగా గ్రూప్-1 ఫలితాల్లో జనరల్ ర్యాంకింగ్ ఎందుకు ప్రకటించలేదో చెప్పాలన్నారు. వందమంది గ్రూప్-1 టాపర్లలో తెలుగు మీడియం అభ్యర్థులు ఎంతమంది ఉన్నారో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు బూర శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం



డా.వెంకన్న

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వవిద్యార్థి ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు డాక్టర్ కుంచం వెంకన్నకు కేంద్ర ప్రభుత్వ ఐసీఎస్ఎస్ఆర్ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు లభించింది. పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ గురుకుల ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయన 2024–25 విద్యా సంవత్సరానికి రూ.36 లక్షల రీసెర్చ్ ప్రాజెక్టును పొందారు. ఇంగ్లిష్ భాషపై రెండు సంవత్సరాల పాటు పరిశోధన చేయనున్నారు. దేశంలో 192 మంది అధ్యాపకులకు ఈ ప్రాజెక్టు లభించగా తెలంగాణ నుంచి ఇద్దరు మాత్రమే ఎంపికైనట్లు చెప్పారు.

అంధకారంలో భవానీ నగర్





విద్యుత్ లైట్లు వెలగక అంధకారంలో ఉన్న భవానీ నగర్‌లోని పలు వీధులు

మరమ్మతులకు నోచుకోని వీధి లైట్లు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భవానీ నగర్ అంధకారంలో ఉంది. కాలనీలోని పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక వారు చీకట్లో మగ్గుతున్నారు. వారం క్రితం కాలనీలోని ఓ విద్యుత్ స్తంభానికి షార్ట్ సర్క్యూట్ కావటంతో విద్యుత్ వైర్లు కాలిపోయాయి. అంతేకాకుండా కాలనీలో ఉన్న వీధి లైట్లు కాలిపోయాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో వారం నుంచి చీకట్లు అలుముకున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేయటంతో కాలిపోయిన విద్యుత్ స్తంభానికి మాత్రం మరమ్మతులు చేసి మిగిలిన వెలగని లైట్ల స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేయలేదు. ఈ కాలనీ నుంచి సత్యసాయినగర్, హెచ్‌పీ రోడ్డు, వేంకటేశ్వరనగర్, ప్రశాంత్‌నగర్‌లకు ఇదే ప్రధాన రహదారి. లైట్లు లేక రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో బండి రమేష్ తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్‌లోని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమన్వయంతో ముందుకు వెళ్తూ పార్టీని మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, పుష్పారెడ్డి, డివిజన్ నాయకులు, యూత్ నాయకుల పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు



గండిమైసమ్మ చౌరస్తాలో ..



కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

కుత్బుల్లాపూర్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఆదివారం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. స్పీకర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో డివిజన్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.



సాయిబాబా నగర్ చౌరస్తాలో ..



బాచుపల్లి సర్కిల్‌లో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న నాయకులు



కొంపల్లి మున్సిపాలిటీలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు